సాక్షి కర్నూలు

గురువారం। 18। జనవరి। 2024



ముమ్మరంగా వాహనాల తనిఖీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నంద్యాల జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకుపాల్పడితే ఉపేక్షించమన్నారు. 10లో▸



సుంకేసులలో 0.554 టీఎంసీలు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో బుధవారానికి 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు కేసీకి 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



ఇంటి వద్దకే ఈ - పాఠం

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోంది. దీంతో ఇంటి వద్దే పాఠాలు నేర్చుకునే అవకాశం కలిగింది. 10లో▸

న్యూస్‌రీల్

జాతీయ సదస్సుకు జెడ్పీచైర్మన్



జెడ్పీచైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: హెల్తీ గ్రామ పంచాయతీ అనే అంశంపై తిరుపతిలో గురువారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న జాతీయ సదస్సులో పాల్గొనేందుకు జెడ్పీచైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి బుధవారం వెళ్లారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని జెడ్పీచైర్మన్ తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి తనతో పాటు పంచాయతీ, పీఆర్ అండ్ ఆర్‌డీకి చెందిన పలువురు అధికారులు, ఇద్దరు సర్పంచ్‌లు, ఎంపీడీఓలు హాజరవుతారని పేర్కొన్నారు.జాతీయ స్థాయి వర్క్ షాపులో గ్రామ స్థాయిలో ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు,తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

రేపటి నుంచి ఆర్‌యూ పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఈనెల 19వ తేదీ నుంచి పునఃప్రారంభం కానుంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్‌యూ, ఆర్‌యూ పరిధిలోని కళాశాలలకు ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ నుంచి యథావిధిగా వర్సిటీ పని చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ తెలిపారు.

డీసీఎంఎస్ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అర్బన్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల పాలక వర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి జీఓ 26 జారీ చేశారు. ప్రస్తుతం డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న సీహెచ్ శిరోమణి పదవీ కాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుంది. కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 డీసీఎంఎస్‌ల పాలక వర్గాల పదవీ కాలం ఈ నెల 19 నుంచి 30వ తేదీ నాటికి పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీ కాలం పూర్తయ్యే నాటి నుంచి ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ప్రస్తుత చైర్మన్ సీహెచ్ శిరోమణి మరో ఆరు నెలలు చైర్మన్‌గా కొనసాగనున్నారు.

త్వరలో ప్రతిరోజూ సూపర్ స్పెషాలిటీ ఓపీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రస్తుతం వారంలో రెండు రోజులు నిర్వహించే సూపర్‌స్పెషాలిటీ ఓపీలు త్వరలో ప్రతిరోజూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఈ-హాస్పిటల్, ఆరోగ్యశ్రీ నిర్వహణపై అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ప్రతి విభాగానికి ఇచ్చే ఆరోగ్యశ్రీ లక్ష్యాలను పూర్తి చేసి ఉత్తమ ప్రతిభ కనపరిచిన పీడియాట్రిక్స్, గ్యాస్ట్రో ఎంట్రాలజి, జనరల్ సర్జరీ హెచ్‌వోడీలను ఆయన అభినందించారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

కర్నూలు (సిటీ): పాఠశాలలకు సంక్రాంతి సెలవులను విద్యాశాఖ పొడిగించింది. తొలుత ప్రకటించిన మేరకు నేటితో (గురువారం) సెలవులు ముగియాలి. అయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈనెల 20వ తేదీ వరకు సెలవులను పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పాఠశాలలు ఈనెల 22వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్నట్లు డీఈఓ పేర్కొన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 23వ తేదీ నుంచి ఎఫ్‌ఏ3 పరీక్షలు యథావిధిగా జరగనున్నాయని ఆయన వెల్లడించారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: నగరపాలక సంస్థలో రాష్ట్ర సిలబస్ (ఇంగ్లిషు మీడియం)తో నిర్వహిస్తున్న డా.ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మార్చి 3వ తేదీన ప్రవేశ పరీక్ష, ఏప్రిల్ 3వ తేదీన ఫలితాలు విడుదల చేస్తామన్నారు. దరఖాస్తులు స్థానిక తమ పాఠశాలలో లభిస్తాయని, ఆసక్తి గల వారు వచ్చే నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, స్టడీ సర్టిఫికెట్ అప్లికేషన్‌కు జత చేసి ఇవ్వాలన్నారు. మెరిట్, ప్రభుత్వ రిజర్వేషన్ నియమాల ప్రకారం సీట్ల ఎంపిక ఉంటుందన్నారు.

కర్నూలు జిల్లా ఆలూరు మండలం రామదుర్గంలో పూర్తయిన గోదాము



పంట భద్రం.. బహుళ ప్రయోజనం!

గ్రామానికి ఒక గోదాము నిర్మించుకుంటున్నాం



పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో 5 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి గోదాము సదుపాయం ఉండాలనేది లక్ష్యం. ఇందుకు అనుగుణంగా 1000 టన్నులు గోదాములు 3,500 టన్నుల గోదాములు 2 ప్రకారం నిర్మిస్తున్నాం. ఇప్పటి వరకు లక్ష్మాపురం-1, లక్ష్మాపురం-2, నెహ్రూనగర్‌లలో గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి మాకు స్వాధీనం కూడా చేశారు. ఈ గోదాములకు డబ్ల్యూడీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాం. డబ్ల్యూడీఆర్‌ఏ గుర్తింపు ఉంటే గోదాముల్లో నిల్వ చేసుకున్న పంట ఉత్పత్తులకు 100 శాతం భద్రత ఉంటుంది.

– రామచంద్రారెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, పగిడ్యాల

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతకు మేలు చేకూర్చడంతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల నిర్మాణాలను ముమ్మరం చేసింది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేనప్పుడు కొద్ది నెలల పాటు నిల్వ చేసుకునేందుకు గోదాములు చక్కగా తోడ్పడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తగిన గోదాముల వసతి లేనందున పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోయినప్పటికి తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ స్థాయిలోనే 500, 1000 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మిస్తుండటంతో గిట్టుబాటు ధర లేనప్పుడు వీటిల్లో నిల్వ చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. ఎరువులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునే సదుపాయం కూడా ఉంది.

రికార్డు స్థాయిలో మల్టీ పర్పస్ గోదాములు

దేశంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో ఒకేసారి ఏకంగా 1.54 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు రూపుదిద్దుకుంటున్నాయి. రైతులకు ఎంతగానో ఉపయోగపడే మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మార్చి నెల చివరిలోపు పనులు పూర్తి చేసి సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అప్పగించేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. గోదాముల నిర్మాణానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లోన్ ఇస్తోంది. గోదాముల నిర్మాణాలకు చేసే వ్యయాన్ని డీసీసీబీకి నాబార్డు రీయింబర్స్ చేస్తుంది. గోదాముల నిర్మాణాలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇప్పటికే రూ.85 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. ప్రతి రైతుభరోసా కేంద్రానికి 500 లేదా 1000 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము ఉండాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. ఇందుకు అనుగుణంగా సర్కారు బహుళ అవసరాల గోదాములు నిర్మిస్తుండటం విశేషం.

శరవేగంగా మల్టీపర్పస్ గోదాముల నిర్మాణం

- ఉమ్మడి జిల్లాలో 1.54 లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు
- మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు
- నిర్మాణాలకు రూ.140 కోట్ల వ్యయం
- ఇప్పటికే 165 నిర్మాణాల పూర్తి
- పూర్తయిన గోదాములు పీఏసీఎస్‌లకు అప్పగింత



నంద్యాల జిల్లా గోస్పాడులో నిర్మించిన మల్టీపర్పస్ గోదాము

రైతులకు మేలు చేకూరేలా..

పండించిన పంటలను అనేక మంది రైతులు నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అనేక సందర్భాల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. గిట్టుబాటు ధర లేనప్పుడు గోదాముల్లో నిల్వ చేసుకొని గిట్టుబాటు ధర లభించినప్పుడు అమ్ముకొని లబ్ధి పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున గోదాములు నిర్మిస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మార్కెటింగ్ శాఖ కర్నూలు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. పంటలను ఆరబెట్టుకునేందుకు ప్రతి గోదాముకు అనుబంధంగా ప్లాట్‌ఫామ్ కూడా నిర్మిస్తుండటం విశేషం.

మార్చి నెల చివరిలోపు పూర్తి చేసేందుకు కృషి

మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలను 2024 మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. కర్నూలు జిల్లాలో కొంత ఆలస్యంగా గోదాముల పనులు మొదలైనప్పటికీ కొద్ది నెలలుగా ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు 55 గోదాముల పనులు పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో గణనీయమైన పురోగతి ఉంది. ఇప్పటికే 110 గోదాముల పనులు పూర్తయ్యాయి. ఆర్‌బీకే వారీగా నిర్మిస్తున్న గోదాముల నిర్వహణ బాధ్యతలను సంబంధిత ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)కు ప్రభుత్వం అప్పగిస్తోంది. ఫలితంగా పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టే అవకాశం ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో 1.54 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గోదాముల సామర్థ్యం 1.54 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటం విశేషం.

- కర్నూలు జిల్లాలో దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో 99 గోదాములు నిర్మిస్తున్నారు. ఇందులో 500 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు 87, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు 12 నిర్మిస్తున్నారు.
- నంద్యాల జిల్లాలో రూ.80 కోట్లతో 133 గోదాములు నిర్మిస్తున్నారు. ఇందులో 65 గోదాములు 500 టన్నుల సామర్థ్యం, 68 గోదాములు 1000 టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి.
- 500 టన్నుల గోదామును రూ.43 లక్షలు, 1000 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను రూ.83 లక్షలతో నిర్మిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలో గోదాముల నిర్మాణాలకు దాదాపు రూ.140 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

గోదాముల కొరతకు పరిష్కారం



పెద్ద ఎత్తున గోదాములు నిర్మిస్తుండటం వల్ల భవిష్యత్‌లో గోదాములకు కొరత ఉండదు. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చు. గోదాముల నిర్మాణం పూర్తి కాగానే సంబంధిత పీఏసీఎస్‌లకు అప్పగిస్తాం.

– సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కర్నూలు, మార్కెటింగ్ శాఖ

27లోపు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేసిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- 9లోపు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపి నవరణ జాబితాలో చోటు



మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల్లో జనవరి 27లోపు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024, పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 27లోపు అన్ని పోలింగ్ సెంటర్లలో ర్యాంపులు, నీటి సౌకర్యం, ట్యూబ్‌లైట్లు, విద్యుత్ సరఫరాతో పాటు వికలాంగుల కోసం వీల్ చైర్లు, షెడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే నోడల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏమైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని సరిచేస్తామని చెప్పారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్‌రూమ్‌లు, రిసెప్షన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని రాజకీయపార్టీల ప్రతినిధులు కూడా చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో నియమించుకునే ఏజెంట్ల పేర్లను తమకు ముందుగానే అందివ్వాలన్నారు. మరోవైపు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలపై ఫిర్యాదులు, సలహాలను కలెక్టర్‌కు అందజేశారు. సమావేశం అనంతరం ఆర్‌యూలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లకు సంబంధించిన భవనాల లేఅవుట్లను ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, వైఎస్‌ఆర్‌సీపీ నుంచి కర్నాటి పుల్లారెడ్డి, ఎస్.రాజేష్ బాబు, టీడీపీ నుంచి ఎల్‌వీ ప్రసాదు, బీజేపీ నుంచి సాయిప్రదీప్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

పకడ్బందీగా కుల గణన

కుల గణనను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. బుధవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కులగణనపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికే ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. వలంటీర్లకు కులగణనపై నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే శిక్షణ ఇచ్చారన్నారు. సర్వే సమయంలో వలంటీర్లు ప్రజలతో మర్యాదగా ప్రవర్తించి వివరాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెలవు రోజుల్లో కూడా సర్వే చేపట్టాలన్నారు.

ఐదు మండలాలకు తహసీల్దార్ల నియామకం

- కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లకు స్థానచలనం
- త్వరలో ఎన్నికల నిబంధనల మేరకు మరికొన్ని బదిలీలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తహసీల్దార్లు లేని ఐదు మండలాలకు రెగ్యులర్ ప్రాతిపదికన తహసీల్దార్లను నియమిస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్‌ఏ) ఏఎం ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో పత్తికొండ, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు, చిప్పగిరి మండలాలకు రెగ్యులర్ తసీల్దార్లు లేరు. ఈ స్థానాల్లో ఫుల్ అడిషనల్ చార్జితో డిప్యూటీ తహసీలార్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఈ మండలాలకు సీసీఎల్‌ఏ కొత్తగా తమసీల్దార్లను నియమించింది. అయితే వీరు తహసీల్దార్ హోదాల్లో కలెక్టరేట్, ల్యాండ్ అక్విజిషన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు కావడం గమనార్హం. ఇదిలాఉంటే ఈనెల 22వ తేదీ తరువాత మరికొన్ని బదిలీలు చేపట్టనున్నట్లు తెలిసింది. డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి కూడా జాబితా తయారీకి సీసీఎల్‌ఏ సిద్ధమైనట్లు సమాచారం.

జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ల వివరాలు..

తహసీల్దారు పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
రామాంజనమ్మ	సి.సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	రాప్తాడు(పుట్టపర్తి జిల్లా)
వి.శ్రీనివాసులు	ఈ.సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	రామగిరి(పుట్టపర్తి జిల్లా)
ఎ.వెంకటేశ్వర్లు	డి.సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	మడకశిర(పుట్టపర్తి జిల్లా)

జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లు...

తహసీల్దారు పేరు	ప్రస్తుతం	కేటాయించిన స్థానం
కె.పద్మజ	ఏఓ, చిత్తూరు కలెక్టరేట్	పత్తికొండ
పి.మురళి	సూపరింటెండెంట్, చిత్తూరు కలెక్టరేట్	కోసిగి
జి.అలెగ్జాండర్	సూపరింటెండెంట్, అనంతపురం కలెక్టరేట్	కౌతాళం
వి.సురేష్‌బాబు	సూపరింటెండెంట్, తిరుపతి కలెక్టరేట్	పెద్దకడబూరు
బి.రాముల నాయక్	ఏఓ, చిత్తూరు ఆర్డీఓ ఆఫీసు	చిప్పగిరి

24 నుంచి నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీలు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం-ఆంధ్ర పోటీల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మండల, మునిసిపాలిటీ స్థాయి పోటీల ముగింపు వేడుకలను 20లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం కలెక్టర్ ఆడుదాం-ఆంధ్ర క్రీడలు, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ ప్రక్రియపై నియోజకవర్గ, మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునిసిపల్, మండల స్థాయిల్లో జరిగే ఆడుదాం-ఆంధ్ర క్రీడలు ఏ కారణంతోనైనా రీ షెడ్యూల్ అయితే వెంటనే పూర్తి చేయాలన్నారు. 20వ తేదీన ముగింపు వేడుకల్లో గెలిచిన టీంలకు ప్రొఫెషనల్ కిట్లను అందజేయాలని సూచించారు. ఆటలకు సంబంధించి స్కోరింగ్ ఆన్‌లైన్‌లో నిర్దిష్టంగా చూపాలని, ఇందులో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ప్రారంభమయ్యే ఆడుదాం-ఆంధ్ర క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 20 ఏళ్లపాటు అనుభవంలో ఉన్న అసైన్‌మెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను 25లోపు పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్వో మధుసూధన్ రావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా పూర్ణాహుతి



స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈఓ



చండీశ్వరస్వామికి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా అవబృథస్నానం చేయిస్తున్న దృశ్యం

- సంప్రదాయబద్ధంగా సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ కార్యక్రమాలు
- నేడు స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం,
- నేటితో ముగియనున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అటు తరువాత పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహాదాశీర్వచనం జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం వసంతోత్సవం జరిపించారు. చండీశ్వరస్వామికి సరస్వి పుష్కరిణిలో అర్చకులు, ఈఓపెద్దిరాజు శాస్త్రోక్తంగా అవబృథస్నానం నిర్వహించారు.

సదస్యం – నాగవల్లి

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలను నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి నిర్వహించారు. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించబడిన అమ్మవారికి ఆగమశాస్త్ర సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలను సమర్పించారు. అలాగే సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటాన్ని అవరోహణ చేశారు.

నేడు అశ్వవాహనసేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవారులు అశ్వవాహనసేవలో భక్తులకు దర్శనమిస్తారు. అశ్వవాహనంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ జరిపిస్తారు. ఆయా పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

నేడు జిల్లా స్థాయి సామాజిక సమతా సంకల్ప సభ

- 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహంపై ప్రజలకు అవగాహన
- సిల్వర్ జూబ్లీ కళాశాల మీటింగ్ హాలులో నిర్వహణ
- ఉదయం 7.30 గంటలకు మారథాన్

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన రాజకీయ జీవనంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం కోసం సామాజిక సమతా సంకల్ప(జన్ భాగీదరి కార్యక్రమం) సభలకు ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఇప్పటికే జిల్లాలోని 26 మండలాలు, 10 మునిసిపాలిటీలు, మూడు డివిజన్లలో ఈ కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, వలంటీర్లు, సిబ్బంది, ప్రజలు హాజరై పూలదండలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ పాత్ర, స్ఫూర్తి, గొప్ప తనాన్ని సచివాలయ ఉద్యోగులు ప్రజలకు వివరించారు. ప్రతి సచివాలయం పరిధిలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి బాబాసాహెబ్ సామాజిక న్యాయానికి ప్రజలు అండగా నిలిచారు. పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు అంబేడ్కర్ స్ఫూర్తిని చాటుతూ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. నేడు జిల్లా స్థాయిలో సామాజిక సమతా సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు మారథాన్ నిర్వహిస్తారు. అనంతరం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో సభ నిర్వహించి డాక్టర బీఆర్ అంబేడ్కర్ గొప్ప తనాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు వివరిస్తారు.

ఇద్దరికి కరోనా పాజిటివ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో తాజాగా మరో ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్స్ విభాగంలో ఒకరు, ఏఎంసీలో ఒకరికి పాజిటివ్ సోకినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. బుధవారం మొత్తం 45 మందికి శాంపిల్స్ సేకరించగా ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

క్లుప్తంగా

ఎస్ఎస్ఏ ఏపీసీగా విజయ జ్యోతి బాధ్యతల స్వీకరణ



కర్నూలు సిటీ: సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్‌గా సీహెచ్ విజయ జ్యోతి కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఎస్ఎస్ఏ అదనపు కో–ఆర్డినేటర్‌గా డా.కె వేణుగోపాల్ పని చేశారు. ఇటీవల రెవెన్యూ శాఖలో తహసీల్దార్లుగా పని చేస్తున్న వారికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా పల్నాడు డీఆర్ఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సీహెచ్ విజయ జ్యోతి కుమారికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి, కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ఆమె మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ డా.జి సృజనను కలిశారు.

అటవీ సంరక్షణలో భాగస్వాములవ్వాలి



పనిముట్లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): అటవీ సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్ఎన్ మూర్తి అన్నారు. జిల్లా పరిధిలోని అటవీ క్షేత్రంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి అవసరమయ్యే పని ముట్లను ఆవుల పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు బుధవారం అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్ఎన్ మూర్తికి అందజేశారు. స్థానిక బొమ్మల సత్రంలోని ఫారెస్ట్ బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎఫ్డీ బీఎన్ఎన్ మూర్తి మాట్లాడుతూ సుమారుగా రూ.5 లక్షలకు పైగా విలువజేసే అడవిలో గడ్డి కోతకు ఉపయోగించే 14 గ్రాస్ కట్టర్లు, అటవీ ప్రాంతంలో మంటలను అదుపు చేయడానికి 15 ఫైర్ బ్లోయర్లు అందజేశారన్నారు. కార్యక్రమంలో నంద్యాల డీఎఫ్ఓ అనురాగ్ మీనా, వైల్డ్ లైఫ్ వార్డెన్ ఆవుల వెంకట నారాయణ రెడ్డి, పువ్వాడి భాస్కర్, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, అటవీ శాఖ అధికారులు శ్రీపతి నాయుడు, శ్రీనాథ్ రెడ్డి, నాసిర్, సూర్యనారాయణ రెడ్డి, జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

వెంకయ్య నగర్‌లో చోరీ

కర్నూలు: నగర శివారు బళ్లారి రోడ్డులోని రేడి యో స్టేషన్‌కు ఎదురుగా వెంకయ్య నగర్‌లో నివాసముంటున్న రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఈయన మెడికల్ రెప్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సంక్రాంతి పండుగకు స్వగ్రామం గూడూరు మండలం యనగండ్లకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి 8 తులాల బంగారం, రూ.20 వేల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇంటి వద్దకే ఈ–పాఠం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోంది. బైజూస్ డిజిటల్ కంటెంట్ సైతం ఆ ట్యాబ్‌లలో ఉంచుతుంది. దీంతో విద్యార్థి ఇంటి వద్ద నుంచే ఆడియో, వీడియో గ్రాఫిక్ ఎలిమెంట్స్ ద్వారా పాఠాలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

- డిజిటల్ బోధనా దిశగా ప్రభుత్వం అడుగులు
- జిల్లాలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- అందుబాటులో ఏడు రకాల కొత్త యాప్స్
- అసెస్మెంట్ యాప్స్ అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు స్కూళ్లు ఎంపిక




ఎమ్మిగనూరు జెడ్పీహైస్కూల్‌లో అసెస్మెంట్ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థులకు అందజేసేందుకు సిద్ధం చేసిన ట్యాబ్‌లు

కర్నూలు (సిటీ): జిల్లాలో 2023–24 సంవత్సరానికి మొదటి దశ (మనబడి నాడు–నేడు కార్యక్రమం పూర్తయిన పాఠశాలలు)కింద 5,161 ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. రెండో విడతలో 24,232 ట్యాబ్‌లతో పాటు యాక్సెసరీస్, ఓటీజీ కనెక్టర్స్, అడాప్టర్స్, 64 జీబీ ఎస్‌డీ కార్డులు ఇవ్వనున్నారు. టీచర్లకు సైతం ట్యాబ్‌లు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డిక్షనరీ యాప్..
ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్య అమలు చేస్తున్నారు. దీంతో తెలుగు మీడియం చదివిన విద్యార్థులు ఇబ్బంది పడకుండా వారు సులువుగా ఆంగ్లం నేర్చుకునేందుకు డిక్షనరీ చక్కగా ఉపయోగ పడుతుంది.

వైఫై మేనేజర్
విద్యార్థులు చదువుతున్న స్కూళ్లలో ఇంటర్‌నెట్ సదుపాయం ఉంటే పాఠశాల పరిసరాల్లోకి వచ్చిన వెంటనే ట్యాబ్‌ను ఆన్ చేస్తే ఆటోమెటిక్‌గా ఓపెన్ అవుతుంది. దీంతో ఆన్‌లైన్‌లో పాఠాలు వినేందుకు, వీడియో పాఠాలు చూసేందుకు వీలవుతుంది.

బైజూస్ ప్రీమియం యాప్..
4వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రీలోడెడ్ కంటెంట్ ఉంటుంది. 64 జీబీ కంటెంట్ అందుబాటులో ఉంచడంతో పాటు ఆఫ్‌లైన్‌లో వీడియోలు వినే సదుపాయాన్ని కల్పించారు. చిన్న చిన్న పరీక్షల ద్వారా అవగాహన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు బైజూస్ ప్రీమియం యాప్ ఎంతో దోహదపడుతుంది.

స్విఫ్ట్ చార్ట్..
విద్యార్థికి ఇది ట్యూటర్ మాదిరిగా పని చేస్తుంది. సబ్జెక్టుల్లో ఏదైనా ఒక పాఠ్యాంశం అర్థం కాకపోతే తిరిగి ఆ అంశాన్ని ట్యాబ్‌లోని ఆ యాప్‌లో టైప్ చేస్తే కృత్రిమ మేధస్సు ద్వారా పూర్తి స్థాయి సమాచారం ఓపెన్ అవుతుంది. ఇంటి దగ్గర హోంవర్క్ చేసుకునేందుకు, చిన్న, చిన్న అసైన్‌మెంట్స్, ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు స్విఫ్ట్ చార్ట్ అనుకూలంగా ఉంటుంది.

ఏపీ ఈ–పాఠశాల యాప్
రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లోని కొంత మంది విషయ నిపుణులను విద్యాశాఖ ఎంపిక చేసి వారితో తెలుగు, ఇంగ్లిషు, హిందీ సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను రికార్డు చేసి వీడియోలు తయారు చేశారు.ఆవన్నీ ఏపీ ఈ–పాఠశాల యాప్‌లో ఉంటాయి.

దులింగో యాప్..
ఇది సుమారుగా 40 విదేశీ భాషలను అత్యంత సులువుగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతుంది. అంతేకాదు భాషలకు సంబంధించిన పదాలు రాయడంతో పాటు కొత్త కొత్త పదాలు తెలుసుకోవచ్చు.

అసెస్మెంట్ యాప్
పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో పేపర్‌లెస్ పరీక్షలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు వారిని ముందుగానే సన్నద్ధం చేసేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఒక్కో జిల్లాలో 4 పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో పెద్దకడబూరు కేజీబీవీ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్(గోనెగండ్ల), జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (ఎమ్మిగనూరు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(హొళగుంద) అందులో ఉన్నాయి. ఇప్పటికే ఆయా స్కూళ్ల టీచర్లకు పేపర్‌లెస్ పరీక్షల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చారు.

ట్యాబ్‌లలో సరికొత్త యాప్స్



విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అభ్యసించడం కోసం ట్యాబ్‌లలో ఈసారి సరికొత్తగా 7 రకాల యాప్స్‌ను అప్‌లోడ్ చేసి ఇస్తున్నారు. ఇందులో డిక్షనరీ, బైజూస్ ప్రీమియం కంటెంట్, ఏపీ ఈ–పాఠశాల యాప్, షిఫ్ట్ చార్ట్ యాప్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బోటు (దులింగో), వై ఫై మేనేజర్ యాప్, అసెస్‌మెంట్ యాప్‌లు ట్యాబ్‌లో ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది



విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ట్యాబ్‌లు చక్కగా ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరడంతో పాటు సబ్జెక్టుకు సంబంధించిన విస్తృత సమాచారం సులువుగా లభిస్తుంది. ఈసారి కొత్తగా అసెస్మెంట్ యాప్‌ను అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు భవిష్యత్తులో పిల్లలు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసేలా సిద్ధం చేస్తున్నాము. ఇందుకు పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో నాలుగు స్కూళ్లు ఎంపిక చేశారు. – డా.వి. రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

ట్యాబ్‌లలో అత్యుత్తమ టెక్నాలజీ



వరుసగా రెండో ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ జరుగుతుంది. ఈసారి పంపిణీ చేస్తున్న ట్యాబ్‌లు అత్యుత్తమ టెక్నాలజీతో కూడినవి. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి స్క్రీన్ గార్డులతో భద్రత ఉండేటట్లు, ఇంటర్నల్ లాక్ సిస్టమ్‌ను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఈ ట్యాబ్‌లలో మొత్తం 7 యాప్‌లు ఉంటాయి. పిల్లలకు ఆధునిక సాంకేతిక విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. – డా.ధన్‌రాజు, జిల్లా నోడల్ ఆఫీసర్, సాంకేతిక విద్య

ఆర్‌యూ వీసీగా సుధీర్ ప్రేమ్‌కుమార్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ
- రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం



కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, వర్సిటీల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు పదవీ కాలం నవంబర్ 24వ తేదీతో ముగియడంతో అప్పటి నుంచి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఫజులుర్ రహమాన్ ఇన్‌చార్జ్ వీసీగా కొనసాగుతున్నారు. తాజాగా హైదరాబాద్ జేఎన్‌టీయూ మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న సుధీర్‌ప్రేమ్‌కుమార్‌ను నియమించారు. ఈయన రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ నేపథ్యం..
వైఎస్‌ఆర్ కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన ఈయన 1964 ఫిబ్రవరి 9న లిల్లి దేవ కృపావతి, బి.దానంలకు జన్మించారు. భార్య డాక్టర్ బి. అనురాధ. ఈయనకు ఇద్దరు కుమారులు. 1979లో జమ్ములమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంపోజిట్ మ్యాథ్స్‌లో ఎస్ఎస్‌సీ పూర్తి చేశారు. అక్కడే 1981లో ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేసి టాపర్‌గా నిలిచారు. 1986లో అనంతపురం జేఎన్‌టీయూలో మెకానికల్ బ్రాంచ్‌లో బీటెక్ పూర్తి చేశారు. 1989లో కోయంబత్తూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంఈ పూర్తి చేసి గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. 2003 ఫిబ్రవరిలో హైదరాబాద్ జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. వైఎస్‌ఆర్ కడప కేఎస్‌ఆర్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలలో 1985– 1993 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 1993 నుంచి 2003 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా 2003 జూలై నుంచి 2006 ఏప్రిల్ వరకు ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 2006 మే నుంచి హైదరాబాద్ జేఎన్‌యూటీయూలో ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఈయనకు 29 సంవత్సరాలు టీచింగ్, 15 సంవత్సరాలు రీసెర్చ్ అనుభవం ఉంది. ఈయన రాసిన పరిశోధన పత్రాలు 96 ఇంటర్నేషనల్ జనరల్స్‌లో పబ్లిష్ అయ్యాయి. 12 మంది స్కాలర్స్‌కు పీహెచ్‌డీలు ఇచ్చారు. 11 మంది పీహెచ్‌డీ చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సెక్రటరీగా పని చేశారు. ఏఐసీటీయూ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులుగా, ఏపీపీఎస్‌సీ సెలెక్షన్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. మూడు టెక్స్టుబుక్స్ రాశారు. డిఫెన్స్ ఆర్గనైజేషన్ అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి రూ.45 లక్షల రీసెర్చ్ ప్రాజెక్ట్ చేశారు. డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా, బీఓఎస్ ఛైర్మన్‌గా, వర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. చాలా సంస్థలకు పరిశీలకులుగా, సలహాదారులుగా ఉన్నారు. పలు అకడమిక్ సంస్థలకు సభ్యులుగా ఉన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత




వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ, శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పరిశీలనలో డీఎంఅండ్‌హెచ్ఓ గిడ్డయ్య

కర్నూలు (టౌన్) : ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గిడ్డయ్య అన్నారు. బుధవారం కర్నూలు నగరపాలక సంస్థ 10 వార్డు 25 వ సచివాలయం పరిధిలోని ప్రజలకు, మహిళలకు స్థానిక ఎగ్జిబిషన్ మైదానంలోని వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 6 వ వార్డు 15 వ సచివాలయం పరిధిలో కూడా ఈ కార్యక్రమం జరిగింది. ఈ రెండు వైద్య శిబిరాలను డీఎంహెచ్ఓ పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఉచిత శిబిరాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ యూనస్‌బాషా, షేక్ నీలోఫర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని చెక్ పోస్టుల వద్ద సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా 19 బైండోవర్ కేసులు, రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎనిమిది ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 24 మందిని అరెస్ట్ చేశామని వారి వద్ద నుండి 53 లీటర్ల సారా, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. 13 డీపీఎల్ కేసులు నమోదు చేసి 380 మద్యం బాటిల్లు సీజ్ చేశామన్నారు. రెండు ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేసి 66 మద్యం బాటిల్లు సీజ్ చేశామన్నారు. ఒక మట్కా కేసు నమోదు చేసి రూ.10,300 స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేసినా ప్రవర్తనలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

మట్కాబీటర్ల అరెస్టు

కర్నూలు : నగర శివారులోని ఉల్చాల జంక్షన్‌లో జోరుగా మట్కా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో నాలుగో పట్టణ ఎస్ఐ మోహన్‌కిషోర్ రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన మన్యం, బుధవారపేటకు చెందిన షబ్బీర్ కొంతకాలంగా ఉల్చాల జంక్షన్‌ను అడ్డాగా చేసుకుని మట్కా నిర్వహిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఇరువురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.22 వేలు నగదుతో పాటు 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

అంబేడ్కర్ సామాజిక న్యాయ మార్గంలో నడవాలి

- జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ కార్డియార్‌లో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా డాక్టర్ అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను జాయింట్ కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న విజయవాడలో దాదాపు రూ.400 కోట్లతో 20 ఎకరాలలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం (జన్ బాగీదరి) కార్యక్రమాన్ని, ఛాయా చిత్ర ప్రదర్శన కలెక్టరేట్‌లో నిర్వహించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప దార్శనికుడని, సామాజిక న్యాయం సాధించడంలో ఆయన మార్గం అనుసరణీయమని తెలిపారు. దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులు లింగస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జీవన్ రాజు, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆయన సమాజానికి చేసిన సేవ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విజయవాడలో దేశంలోనే అత్యంత ఎత్తైన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్ర మాలికను సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, వివిధ దళిత సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బియ్యం ధరలకు రెక్కలు

- గత ఖరీఫ్‌లో తుఫాన్ ప్రభావంతో తగ్గిన దిగుబడులు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- అమాంతం పెరిగిన సన్న బియ్యం ధరలు



కోవెలకుంట్ల: ప్రజలకు ప్రధాన ఆహారమైన బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో దిగుబడులు కాస్త తగ్గగా కొందరు వ్యాపారులు దీన్ని అసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి సన్నబియ్యం ధరలను అమాంతం పెంచారు. బియ్యం నిల్వలను దాచి కొరత అంటూ రోజు రోజుకు ధరలను పెంచుతున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కుందూనది, పాలేరు, కుందరవాగు, కేసీకెనాల్, తదితర సాగునీటి వనరుల ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో 67,811 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా 57,755 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల సోనా, 555 రకాలకు చెందిన వరిని సాగు చేశారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 9,105 హెక్టార్లలో వరి సాగు కావాల్సి ఉండగా 6,749 హెక్టార్లలో వరి సాగైంది. పైరు కోత దశలో ఉండగా తుఫాన్ దిగుబడులపై ప్రభావం చూపింది. రాయలసీమ జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల్లో వరి కోత, నూర్పిడి సమయంలో దిగుబడులపై తుఫాన్ దెబ్బతీసింది. 40 నుంచి 45 బస్తాల దిగుబడులు వస్తాయనుకుంటే వర్షం కారణంగా దిగుబడులు 40 బస్తాల్లోపు వచ్చాయి.

నంద్యాల సోనా క్వింటా రూ. 7వేలు:
వ్యాపారులు సన్నబియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టించడంతో బియ్యం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకు మార్కెట్‌లో నంద్యాల సోనా రకం (పాతబియ్యం) క్వింటా రూ. 5,500 ఉండగా ప్రస్తుతం రూ. 7వేలు ధరకు చేరింది. ఇదే రకం కొత్తవి రూ. 6,200 ధర పలుకుతోంది. కర్నూలు సోనా రకం గతంలో క్వింటా పాత బియ్యం రూ. 4,400 ఉండగా ప్రస్తుత మార్కెట్‌లో రూ. 6,500లకు చేరింది. కొత్త బియ్యం రూ. 5,400 ధర పలుకుతున్నాయి. కొన్ని రోజుల వ్యవధిలోనే బియ్యం ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు బియ్యం కొనడం భారంగా మారింది. జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో కొందరు వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను భారీగా దాచి ఉంచినట్లు తెలుస్తోంది.

మద్దతుధర పెంపుతో వ్యాపారులకు లాభం
రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్ల నుంచి వరికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర కల్పిస్తోంది. గత ఏడాది వరిసాగుకు ముందే గ్రేడ్-1 రకం క్వింటా రూ. 2,060, గ్రేడ్-2 రకం రూ. 2,040 ధర ప్రకటించింది. ఈ ఏడాది ఆ ధరలను మరింత పెంచి గ్రేడ్-1 రకం క్వింటా 2,203, గ్రేడ్-2 రకం రూ. 2,183 ధర నిర్ణయించింది. ఏటా మద్దతు ధర పెంపు వ్యాపారులకు లాభం చేకూరుస్తోంది. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి దాన్ని బియ్యంగా మార్చి వ్యాపారం నిర్వహిస్తున్నారు. బియ్యం కొరత చూపించి ధరలను భారీగా పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్ అధికారులు బియ్యం నిల్వలపై దాడులు చేసి కృతిమ కొరతను అరికడితే ధరలు సాధారణ స్థితికి వచ్చే ఆస్కారం ఉందని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు తనిఖీలు చేయాలి



గత రెండు నెలల నుంచి సన్నబియ్యం ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గతంలో 50 కిలోల కర్నూలు సోనా బియ్యం ప్యాకెట్ రూ. 2,200 ఉండగా ప్రస్తుతం రూ. 3,300లకు చేరింది. బియ్యం వ్యాపారులు బియ్యం కొరత చూపించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బియ్యం ధర భారంగా మారింది. అధికారులు తనిఖీలు చేసి కృత్రిమ కొరతను అడ్డుకోవాలి. – రమణారెడ్డి, సొదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

బియ్యం ధరలు తగ్గించాలి



మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయి. మాలాంటి పేద ప్రజలు అంతమొత్తం పెట్టి బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. కొందరు వ్యాపారులు బియ్యాన్ని నిల్వ చేసుకుని కొరత చూపించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని బియ్యం ధరలు తగ్గించాలి.
– రఘు, కోవెలకుంట్ల

ఫిర్యాదులందితే దాడులు చేస్తాం

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు సన్న బియ్యం నిల్వలు ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే దాడులు నిర్వహిస్తాం. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించకపోతే చర్యలు తప్పవు.
– సునీల్, విజిలెన్స్ సీఐ, నంద్యాల

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాజేంద్ర సురీస్వర్ జయంతి



స్వామీజీ చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న జైన్ సంఘ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: జైన్ శ్వేతంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో జైన్ సంఘీయుల అతిపెద్ద గురువు రాజేంద్ర సురీస్వర్ మహరాజ్ 197వ జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినం రోజే సమాధి పొంది 117 సంవత్సరాలు కావడంతో జైన్‌లు ఉపవాసదీక్షలు ఆచరిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఓల్డ్ సిటీలోని జైన్ ఆలయం నుంచి మహావీర్ చౌక్ వరకు స్వామీజీ చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, స్వామీజీ బోధనలు జరిగాయి. సంఘ్ ప్రతినిధులు జయంతి లాల్, రాజేంద్రకుమార్, రమేష్ భండారి, తదితరులు పాల్గొన్నారు.

మందుల ఉత్పత్తిలో ఫార్మసిస్టులు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్):మందుల పంపిణీ, ఉత్పత్తి జరిగే చోట తప్పనిసరిగా ఫార్మాసిస్టులు విధుల్లో ఉండాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మసిస్టు ఆర్గనైజేషన్ సభ్యులు ఎం.బ్రహ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫార్మసీ రంగం దినదినాభివృద్ధి చెంది ప్రతి నిత్యం కొత్త కొత్త మందులు తయారవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి రంగంలో ఫార్మసిస్టుల కృషి, శ్రమ నైపుణ్యం ఎంతో ఉందని తెలిపారు. ఔషధాలు తయారు చేసే చోట, పంపిణీ జరిగే చోట ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 42ను పటిష్టంగా అమలు చేసి, ఫార్మాసిస్టులు మాత్రమే ఈ పనులు చేపట్టేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సమ్మె ఉద్ధృతం చేస్తాం

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం స్పందించి తమ జీతాలు పెంచకపోతే సమ్మెను మరింత ఉద్ధృతం చేస్తామని అంగన్‌వాడీ సిబ్బంది ప్రకటించారు. బుధవారం 37వ రోజు సమ్మెలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.డాక్టర్ శంకర్ హాజరై అంగన్‌వాడీలకు మద్దతుగా సంతకం చేశారు. వారు కోరుతున్నట్లు జీతాలు పెంచాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు సీపీఎం సదస్సు

కర్నూలు(సెంట్రల్): కామ్రేడ్ టి.నరసింహయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం 5 గంటలకు లలిత కళా సమితిలో భారత రాజ్యాంగం-మతం-ప్రభుత్వ పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి హాజరవుతున్నట్లు చెప్పారు.

దూప దీప నైవేద్యం స్కీం వర్తింపజేయాలి

కర్నూలు కల్చరల్: జిల్లాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాలకు దూప దీప నైవేద్య పథకం వర్తింపజేయాలని కోరుతూ బుధవారం దేవదాయ శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ్య ఆచారి ఆధ్వర్యంలో పత్తికొండ విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు శంకరయ్య ఆచారి, శరభయ్య ఆచారి, వీరాచారి, పురోహితులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలనా పాలనకు నోచుకోని జిల్లాలోని ఆలయాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న డీడీఎన్ఎస్‌ను వర్తింపచేయాలని కోరారు.

పీఆర్ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం తదితరులు

కర్నూలు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను పంచాయతీరాజ్ ఎస్ఈ కె.సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. బుధవారం రాత్రి జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రారెడ్డి, ఆర్.సతీష్ కుమార్, పీఆర్, పీఐయూ, ఈఈలు మద్దన్న, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. డైరీలో ఇంజనీర్స్‌కు సంబంధించిన అనేక విషయాలను పొందుపరచడం వల్ల ఉపయోగకరంగా ఉందన్నారు.

నగరం.. రహదారులు ఘనం

- యుద్ధప్రాతిపదికన రహదారుల విస్తరణ పనులు
- బళ్లారి చౌరస్తా వద్ద 120 అడుగుల రోడ్డు వెడల్పు
- రూ.కోటి వెచ్చించి 350 మీటర్ల పొడవునా రహదారి విస్తరణ
- రూ.2 కోట్లతో ఆర్ అండ్ బీ ఆఫీసు నుంచి బి.క్యాంపు పోస్టాఫీసు వరకు విస్తరణ పనులు
- ఐటీసీ, వినాయక్ ఘాట్, వాల్‌మార్ట్ వద్ద వెండర్స్ జోన్ ఏర్పాటు
- స్మార్ట్ సిటీ దిశగా చర్యలు : రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్



సి.క్యాంపు నుంచి బిర్లాగేట్ రోడ్డు విస్తరణ, మధ్యలో డివైడర్



వాల్‌మార్ట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి విస్తరణ, డివైడర్ల ఏర్పాటు

కర్నూలు (టౌన్): రెండేళ్లలో కర్నూలు నగర అభివృద్ధిలో ఊహించలేని విధంగా మార్పు వచ్చింది. ఐదేళ్ల క్రితంతో పోల్చుకుంటే నగరం ఎంతో వృద్ధి సాధించింది. చెత్త రహిత నగరంగానే గాకుండా పచ్చదనంతో పాటు రహదారులను విస్తరణ చేపట్టారు. కొత్తగా శానిటేషన్ డివిజన్లు, ఇంటింటి చెత్త సేకరణ, డస్ట్ బిన్లు అవసరం లేని నగరంగా పాలకవర్గం, మున్సిపల్ అధికారులు తీర్చిదిద్దారు. రోడ్ల విస్తరణతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరించడం సర్కిళ్ల ఏర్పాటు, స్మార్ట్ స్ట్రీట్, వెండర్స్ జోన్ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.

ముమ్మరంగా విస్తరణ పనులు

మూడేళ్ల క్రితం నగర విస్తీర్ణం 67 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2020లో నగర శివారులోని పందిపాడు, లక్ష్మీపురం, పెద్దపాడు వంటి గ్రామాలను కర్నూలు నగరపాలక సంస్థలో విలీనం చేశారు. ఇప్పటికే మామిదాలపాడు, మునగాలపాడు, స్టాంటన్ పురం గ్రామాలు నగరపాలక పరిధిలో చేర్చారు. దీంతో నగర విస్తీర్ణం 119 చదరపు కిలోమీటర్ల పరిధికి చేరుకుంది. 2021లో నగర పాలకకు ఎన్నికలు జరగడం, అధికార పార్టీ పాలకవర్గం రావడంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కరించే విధంగా గతేడాది 100 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా 120 అడుగులు చేశారు. మొత్తం 350 మీటర్ల మేర ఉల్చాల రోడ్డు వరకు రహదారిని విస్తరించారు. అలాగే రాజ్‌విహార్ నుంచి మౌర్య ఇన్ వరకు విస్తరణ చేపట్టారు. స్థానిక రహదారులు భవనాల శాఖ డీఈఈ కార్యాలయం నుంచి ప్రజారోగ్య సాంకేతిక శాఖ, వాతవరణ శాఖ, బి.క్యాంపు పోస్టాఫీస్ వరకు రోడ్డు వెడల్పు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఇక్కడ 120 అడుగుల మేర రహదారిని విస్తరించారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి సి.క్యాంపు మీదుగా బిర్లా రోడ్డు నుంచి హైవే వరకు ప్రాధాన్యత క్రమంలో రహదారిని విస్తరించారు. స్థానిక ఏ.క్యాంపు సర్కిల్ నుంచి జొహరాపురం కిమ్స్ ఆసుపత్రి వరకు రహదారి విస్తరణ, మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది.

ముఖ్య కూడళ్లలో సర్కిళ్ల ఏర్పాటు

నగరంలో వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక బంగారుపేట వద్ద సర్కిల్ ఏర్పాటు చేశారు. బంగారు పేట వద్ద రహదారిని విస్తరించి సర్కిల్ ఏర్పాటు చేశారు. బిర్లాగేట్ వద్ద సర్కిల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాల్‌మార్ట్ వద్ద రహదారులను 120 అడుగులు విస్తరించి సర్కిల్, దండి సత్యాగ్రహ విగ్రహం ఏర్పాటు చేశారు. పచ్చని గడ్డి, విద్యుత్ లైట్లతో సుందరీకరణ చేశారు. అక్కడి నుండి సి.క్యాంపు వరకు రహదారిని విస్తరించి మధ్యలో డివైడర్లు ఏ ర్పాటు చేశారు. ముఖ్యమైన ప్రాంతాల్లో రహదారు లను విస్తరించడంతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.

వెండర్స్ జోన్ ఏర్పాటు

ఎక్కడపడితే అక్కడ వీధి వ్యాపారులు, రోడ్ సైడ్ వ్యాపారులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా వెండర్స్ జోన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్థానిక కేసీ కెనాల్ వినాయక ఘాట్ ఎదురుగా, వాల్‌మార్ట్ ఎదురుగా, కృష్ణానగర్ ఐటీసీ సమీపంలో వ్యాపారుల కోసం వెండర్స్ జోన్ ఏర్పాటు చేశారు. దీనికి వ్యాపారులు, నగరవాసుల నుంచి మంచి స్పందన వస్తోంది.

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని..

- రూ.10 లక్షలతో బంగారుపేట వద్ద సర్కిల్
- రూ.25 లక్షలతో బిర్లాగేట్ వద్ద సర్కిల్
- రూ.30 లక్షలతో వాల్‌మార్టు వద్ద సర్కిల్, దండి సత్యాగ్రహ విగ్రహం
- రూ.కోటితో బళ్లారి చౌరస్తా వద్ద 350 మీటర్ల మేర రహదారి విస్తరణ పనులు
- రూ.కోటితో 500 మీటర్ల మేర సి.క్యాంపు నుంచి బిర్లాగేట్ మీదుగా బి.క్యాంపు పోస్టాఫీసు వరకు విస్తరణ
- రూ.2 కోట్లతో 800 మీటర్ల మేర వాల్‌మార్టు వద్ద విస్తరణ, డివైడర్లు, రహదారి విస్తరణ పనులు
- రూ.60 లక్షలతో జొహరాపురం రోడ్డుకు ఇరువైపులా డివైడర్లు, విస్తరణ పనులు



కె.సి.కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన వెండర్స్ జోన్

విస్తరణ పనులు చక్కగా చేశారు



గతంలో జనాభా పెరిగినా రహదారులను విస్తరించ లేదు. దీని వల్ల బైక్‌పై వెళ్లాలన్నా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా రహదారులను బాగా విస్తరించారు. ట్రాఫిక్ సమస్య తగ్గింది. ముఖ్య కూడళ్లలో రోడ్లను విస్తరించడం వల్ల ఇబ్బందులు తొలిగాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు గణనీయంగా మార్పు వచ్చింది.

– వడ్ల సూర్యుడు

సర్కిళ్ల వల్ల ఎంతో ఉపయోగం



నగరంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలంటే సర్కిళ్లు విశాలంగా ఉండాలి. ఆ దిశగా చర్యలు చేపట్టడం మంచి నిర్ణయం. ఎక్కడికక్కడ సర్కిళ్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చు. వేగంగా వెళ్లే బైక్‌లు, ఆటోలను నియంత్రించవచ్చు. అలాగే క్రమపద్ధతిలో వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

– వసంత్‌కుమార్

అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



నగరంలో గత మూడు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. చేపడుతున్నాం. ముఖ్యంగా నగర పాలకలో రహదారుల విస్తరణ, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, సర్కిళ్ల ఏర్పాటు, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిగ్నల్స్, రోడ్ సైడ్ వ్యాపారుల కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో వెండర్స్ జోన్ ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. అలాగే పార్కులను అందంగా తీర్చిదిద్దాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. పనులు టెండర్ దశలో ఉన్నాయి.

– రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్, నగరపాలక సంస్థ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): స్థానిక బాలాజీనగర్‌లో బురుజు రవిపతి జ్ఞాపకార్థం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు బుధవారం సాయంత్రం ముగిసింది. విజేతలకు బహుమతుల కార్యక్రమం నిర్వహించారు. అతిథులుగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. యువతను ప్రోత్సహించేందుకు టోర్నీ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆమెతో పాటు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఏపీఐడీసీ డైరెక్టర్ పాటిల్ హనుమంత రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సాంబశివరావు విజేతగా నిలిచిన జోసఫ్ జట్టు, రెండవ స్థానంలో నిలిచిన లక్ష్మీ జట్టుకు ట్రోఫీలు అందజేశారు.



విజేత జోసెఫ్ జట్టుకు కప్పు అందజేస్తున్న కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహారి

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక ఎర్రబురుజులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం, శ్రీరామనగర్ పరిధిలోని జేఎస్ఆర్ నగర్ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. టీకాల వల్ల పిల్లలను వ్యాధుల భారి నుంచి కాపాడవచ్చన్నారు. సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులచే అన్ని రకాల వ్యాధులకు చికిత్సతో పాటు ఉచితంగా మందులను అందిస్తారని, శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉన్నత ఆసుపత్రికి రెఫర్ చేస్తారన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

22 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 22, 23 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపురంలో 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 నుంచి 2007 సంవత్సరం మధ్య జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తారని, త్వరలో మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రేపు జిల్లా ట్రెజరీలో చెక్కుల కాల్చివేత

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయం, జిల్లాలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో ఉండిపోయిన చెక్కులను శుక్రవారం కాల్చివేయనున్నారు. 2018 ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎస్ అమలులోకి వచ్చింది. నాటి నుంచి మండల పరిషత్‌లకు, గ్రామ పంచాయతీలకు ఎలక్ట్రానిక్ చెక్కుల ద్వారా నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో మాన్యువల్ చెక్ బుక్కులు వృథాగా ఉండిపోయాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ట్రెజరీల్లోని స్ట్రాంగ్ రూమ్‌లను ఖాళీ చేయాల్సి ఉండటంతో కాలం చెల్లిపోయిన చెక్కు బుక్కులను దగ్ధం చేసేందుకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ట్రెజరీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా జిల్లా ట్రెజరీలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను గురువారం తీసుకెళ్లాలని జేసీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా శాఖల డీడీఓలు ట్రెజరీ కార్యాలయానికి రానున్నారు. జిల్లా ట్రెజరీలో 45, ఆదోని డివిజనల్ సబ్ ట్రెజరీలో 1 ప్రకారం 46 సేఫ్ కస్టడీ ఆర్టికల్స్ ఉన్నాయి. ఇందులో సీఐడీకి సంబంధించిన కేసు ఇంకా విచారణకు రానందున తమకు సంబంధించిన సేఫ్ కస్టడీ ఆర్టికల్‌ను జిల్లా ట్రెజరీలోనే భద్రపరచుకోవాలని లేఖ పెట్టినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో మూడేళ్ల పైబడి ఉండిపోయిన వాటిని నేడు ఆయా శాఖలకు అప్పగించనున్నారు.

నేడు, రేపు బీసీల రథయాత్ర

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశాలపై ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు నిర్వహిస్తున్న బీసీల రథయాత్ర ఈ నెల 18, 19 తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చేరుకుంటుందని బీసీ సంఘాల నేతలు తెలిపారు. బుధవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ కార్యదర్శి కే రామక్రిష్ణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా ఈశ్వరయ్య, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, జిల్లా అధికార ప్రతినిధి విజయ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తకోట మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల రథయాత్ర ఈ నెల 18వ తేదీన నంద్యాల జిల్లా ఆత్మకూరు, నందికొట్కూరులో పర్యటిస్తుందని, 19వ తేదీన కర్నూలు జిల్లాలో ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే 19న నగరంలోని అంబేడ్కర్ భవన్ నుంచి బిర్లాగేట్ పూలే విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 90 అసెంబ్లీ, 12 పార్లమెంట్ స్థానాలను కేటాయించాలన్నారు. బైక్ ర్యాలీకి పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొనాలని వారు కోరారు. నాయకులు సీపీ వెంకటేష్, రజక వెల్ఫేర్ కమిటీ సభ్యులు బలరాం, శివరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

కోడుమూరు రూరల్ : పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగనన్న పాటుపడుతున్నారని గుర్తు చేశారు. కోడుమూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.మద్దయ్య, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి దంపతులు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, కర్నూలు, సి.బెళగల్ మండలాలకు చెందిన 140 మంది పాస్టర్లకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోట్ల హర్ష చేతుల మీదుగా వారు పాస్టర్లకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల మూలంగా రాష్ట్ర పరిస్థితి బాగోలేనప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారని గుర్తు చేశారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులంతా జగనన్న పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోట్ల పిలుపునిచ్చారు.



పాస్టర్లకు నూతన దుస్తులు పంపిణీ చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాల విడుదల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 19న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను క్రైస్తవ సంఘం పెద్దలతో కలిసి విడుదల చేశారు.

ఆలయాల్లో స్వచ్ఛత కార్యక్రమం

కర్నూలు కల్చరల్: రామనామంతో దేశం నిండిపోయిందని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేవాలయాల స్వచ్ఛ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం కర్నూలు అశోక్‌నగర్‌లోని శ్రీ భ్రమరాంబా మల్లికార్జున దేవాలయంలో దేవాలయాల స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త విజయమ్మ, అరుణ, పూజారి మధుసూదన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలి

కర్నూలు (టౌన్): స్థిరమైన జీవితం..ఉజ్వల భవిష్యత్తు.. తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి భావి తరాలకు మార్గదర్శకంగా నిలవాలని హెర్మోన్ క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ పాస్టర్ డి.జాన్‌మోజస్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక రాజ్ పుష్పా ఫంక్షన్ హాలులో యూత్ క్యాంపు నిర్వహించారు. ఆంధ్రతో పాటు తెలంగాణ, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాల నుంచి యువత తరలివచ్చారు. పాస్టర్ దైవసందేశం అందిస్తూ క్రీస్తు బోధనలతో నిజమైన క్రైస్తవులుగా రాణించాలన్నారు. యూత్ క్యాంపులో కళ్యాణ్, జెస్విల్, డాక్టర్ హర్సన్, టోనీ అమూల్య, ఫ్లోరా భక్తి గీతాలను ఆలపించారు. యూత్ ఆర్గనైజర్లు పాస్టర్ రమేష్‌బాబు, జాన్ జోనాథాన్, జాన్ జడ్సన్ పాల్గొన్నారు.



దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ డి.జాన్‌మోజస్

పెయింటర్ ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని ఖండేరి వీధికి చెందిన తెలుగు శేఖర్ (35) ఇంట్లో పేన్ల మందు తాగడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. ఈయన పెయింట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తెల్లవారుజామున ఇంట్లో ఉన్న పేన్ల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య లలితమ్మతో పాటు ఇద్దరు కుమారులు సంతానం. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మందిని డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలకు 7,417 మందికి గాను 6,845 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఒకటవ సెమిస్టర్ పరీక్షకు 1029 మందికిగాను 903 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. చూచిరాతకు పాల్పడిన కర్నూలు డిగ్రీ కళాశాలలో- 5, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో - 5, ఆళ్లగడ్డ ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో-2, కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో-2, కర్నూలు వాసవీ మహిళా డిగ్రీ కళాశాల, పత్తికొండ విజయ సాయి డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 17 మందిని డిబార్ చేసినట్లు తెలిపారు.

సినిమాలో విలన్ల పేర్లు మార్చాలి

కర్నూలు కల్చరల్: మహేష్‌బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమాలో విలన్ల పేర్లు మార్చాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వెంకటేష్ సినిమా థియేటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ సినిమాలో విలన్ల పేర్లు లెనిన్, మార్క్స్ అని పెట్టడం దారుణమన్నారు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసిన కారల్‌మార్క్స్, రష్యా విప్లవం తెచ్చిన లెనిన్ లాంటి మహనీయుల పేర్లను సినిమాలో విలన్ పాత్రలకు పెట్టి చిత్రీకరించడం తగదన్నారు. వెంటనే పేర్లు మార్చాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు బాబాయ్, కార్యదర్శి బీసన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

22న లక్ష పుష్పార్చన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని రాగ మయూరి గ్రీన్ హిల్స్ విద్యాసుందర సరస్వతి పీఠం సరస్వతి దేవాలయంలో ఈ నెల 22వ తేదీన సీతారామ లక్ష్మణ అభయాంజనేయ స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అయోధ్యలో ఈ నెల 22వ తేదీన రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సరస్వతి దేవాలయంలో సాయంత్రం 4:30 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మిరప పంట దగ్ధం

కల్లూరు: కల్లూరు మండలం కొంగనపాడులో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిరపపంటను దగ్ధం చేశారు. గ్రామానికి చెందిన తెలుగు నాగయ్య, తెలుగు శ్రీనివాసులు పొలంలో మిరపకాయలు ఆరబోశారు. ఒక్కొక్కరు ఐదు ఎకరాల చొప్పున మిరపను సాగు చేశారు. వీటిని రాత్రి 8 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితులు తెలిపారు. దాదాపు 120 క్వింటాళ్ల మిరప పంట దగ్ధం అయ్యిందని బాధితులు వాపోయారు.